# నమస్తే తెలంగాణ

# సిద్దిపేట

I | హైదరాబాద్, మంగళవారం 4 మార్చి 2025 | SIDDIPET




కేసీఆర్‌కు ప్రసాదాన్ని అందజేస్తున్న మాజీ జడ్పీటీసీ మల్లేశం

## కేసీఆర్‌ను కలిసిన మాజీ జడ్పీటీసీ

గజ్వేల్, మార్చి 3: మాజీ జడ్పీటీసీ సభ్యుడు పంగ మల్లేశం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను ఎర్రవల్లిలో వ్యవసాయ క్షేత్రంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా అరుణాచల క్షేత్రంలో ప్రత్యేక పూజలు చేయించి, తెచ్చిన ప్రసాదాన్ని కేసీఆర్‌కు ఆయన అందజేశారు.



సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం శ్రీగిరిపల్లి సమీపంలో మల్లన్నసాగర్ నుంచి కొండపోచమ్మ సాగర్‌లోకి కాళేశ్వరం జలాలను తరలించే కాలువ నీరు లేక వెలవెలబోతున్న దృశ్యం

# నెర్రెలిడుతున్న పొలాలు

## అడుగంటిన భూగర్భ జలాలు

### ఎండుతున్న పొలాలు.. ఆందోళనలో రైతులు

ఓవైపు పెరిగిన ఎండల తీవ్రత.. మరోవైపు అడుగంటిన భూగర్భ జలాలు..వెరసి పంటలు ఎండిపోతుండడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. మెదక్ జిల్లాలో రైతులను కదిలిస్తే కంట నుంచి కన్నీరే వస్తున్నది. ఎండిన వరిపంట పశువులకు మేతగా మారుతోంది. అప్పులు చేసి వరి సాగు చేయగా, పొట్టదశలో ఉన్న పంట దెబ్బ తింటున్నదని రైతులు వేదనకు గురవుతున్నారు. కండ్ల ముందే పంట ఎండుతుండడంతో రైతుల గుండె తరుక్కుపోతున్నది. ఎండిన వరి పొలాల్లో పశువులను మేపుతున్నారు. వరి పంటనే కాకుండా కూరగాయల పంటలకు సైతం పారకం పెడదామంటే బోర్ల నుంచి నీరు రావడం లేదని రైతులు వాపోతున్నారు.

- మెదక్ జిల్లాలో 2,58,487 ఎకరాల్లో వరి సాగు
- బోరుబావుల్లో తగ్గిన నీటిమట్టం
- పశువులకు మేతగా మారిన పొలాలు



మెదక్ జిల్లా కొల్చారంలో ఎండిపోయిన వరి పంట

మెదక్, మార్చి 3(నమస్తే తెలంగాణ): మెదక్ జిల్లాలోని మెదక్, నర్సాపూర్, తూప్రాన్ డివిజన్‌లోని గ్రామాల్లో భూగర్భజలాలు అడుగంటుతున్నాయి. ఎక్కువ శాతం బోరుబావుల కింద రైతులు యాసంగి పంటలు సాగుచేశారు. సరిగ్గా నీరందక పొలాలు ఎండుముఖం పడుతున్నాయి. గడిచిన వానకాలంలో భారీ వర్షాలకు జిల్లాలో చెరువులు, కుంటలు నిండి పొంగిపొర్లాయి. భారీ వర్షాలకు కొన్ని ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లి చేతికి రాకుండా నేలపాలైంది. చెరువులు, కుంటలను జలకళను సంతరించుకోవడంతో రైతులు యాసంగిపై ఆశలు పెంచుకున్నారు. వరి సాగు వైపు మొగ్గు చూపారు. ఫిబ్రవరి మొదటివారం నుంచే ఎండలు తీవ్రరూపం దాల్చడంతో వ్యవసాయ బావుల్లో భూగర్భ జలాలు అడుగంటడం ప్రారంభమైంది. వరికి సరిపడా నీరందించలేక రైతులు అప్పులు చేసి బోర్లు వేయిస్తున్నారు. అయినా చుక్కనీరు పడకపోవడంతో దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. చేసేదేమీ లేక నెర్రెలు వారిన పొలాల్లో పశువులను మేపుతున్నారు.

**పొట్ట దశలో మాడిపోతున్న వరి...**

మెదక్ జిల్లాలో ఈ యాసంగిలో 2,58,487 ఎకరాల్లో వరి పంట సాగుచేశారు. ఇతర పంటలు 800 ఎకరాల్లో రైతులు వేశారు. ఇందులో వ్యవసాయ బావులు, బోరుబావుల కింద దాదాపు లక్ష ఎకరాల్లో వరి పంటను సాగు చేసినట్లు వ్యవసాయాధికారులు తెలిపారు. వ్యవసాయ బోర్ల వద్ద సాగుకు నీరందకపోవడంతో పొట్ట దశకు చేరిన వరి ఎండలకు మాడిపోవడంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఈసారి దిగుబడులు ఎక్కువగా వస్తాయని రైతులు ఆశించారు. కానీ, వారి ఆశలు అడియాశలు అయ్యాయి. భూగర్భ జలాలు అడుగంటి బోర్లు, బావుల్లో నీరు రాకపోవడతో పొట్ట దశకు వచ్చిన వరిని కాపాడుకోలేక పోతున్నారు.



మెదక్ జిల్లా పాతూరులో ఖాళీ బిందెలతో రాస్తారోకో చేస్తున్న మహిళలు

## ఖాళీ బిందెలతో మహిళల రాస్తారోకో

మెదక్ రూరల్, మార్చి 3: మెదక్ జిల్లా పాతూర్‌లో సోమవారం తాగునీటి కోసం మహిళలు రోడ్డెక్కారు. ఖాళీ బిందెలతో మెదక్–రామాయంపేట ప్రధాన రహదారిపై పాతూర్ గ్రామం వద్ద ఆందోళనకు దిగారు. మిషన్ భగీరథ నీళ్లు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ ఉన్నప్పుడు ఏనాడు నీళ్లకోసం ఇక్కట్లు పడలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డుపై గంటసేపు ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. మెదక్ రూరల్ ఎస్సై మురళి, ఎంపీడీవో రఘు ఘటనా స్థలానికి చేరుకుని సముదాయించేందుకు యత్నించారు. దీంతో మహిళలు ఎంపీడీవోను నిలదీశారు. నీటి సమస్యను పరిష్కరిస్తామని, నీటి సమస్య తీరేదాక ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తామని హామీ ఇవ్వడంతో మహిళలు ఆందోళన విరమించారు.

## సాగునీరిచ్చి పంటలను కాపాడండి

- ప్రజావాణిలో రైతుల వినతి



మెదక్‌లో అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న పాతూర్ రైతులు

మెదక్, మార్చి 3(నమస్తే తెలంగాణ): రాయిన్‌పల్లి ప్రాజెక్టు కింద పాతూర్, చీపురుదిబ్బ తండా, రాయిన్‌పల్లి గ్రామాల్లో పంటలకు సాగునీరు అందించాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేశ్‌కు గ్రామ రైతులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. భూగర్భ జలాలు అడుగంటి రాయిన్‌పల్లి ప్రాజెక్టు పరిధిలోని పాతూర్, చీపురుదుబ్బ తండా, రాయిన్‌పల్లి గ్రామాల్లో బోర్లలో నీరు సరిగా రావడం లేదన్నారు. రాయిన్‌పల్లి చెరువు నుంచి వచ్చే నీటిని వాగులో మోటర్లు పెట్టి వరి పంటను సాగు చేసేవాళ్లమని, ఈసారి వాగులో నీరు రావడం లేదని, అందువల్ల వేసిన వరి పంట ఎండిపోయేలా ఉన్నదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాయిన్‌పల్లి ప్రాజెక్టులో నీరు ఉన్నందున విడుదల చేసి పంటలు కాపాడాలని కోరారు.

## కరాటే నగేశ్‌కు వరల్డ్ రికార్డ్స్‌లో చోటు



సుమన్ చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందుకుంటున్న నగేశ్

మెదక్ మున్సిపాలిటీ, మార్చి 3: మూడున్నర దశాబ్దాలుగా వేలాది మంది విద్యార్థులకు కరాటే శిక్షణ ఇవ్వడంతో పాటు రెంజూకీ షోటోకాన్ కరాటే క్లబ్ సంస్థను స్థాపించి వంద మంది కరాటే మాస్టర్లతో తెలంగాణలో పలు జిల్లాల్లో కరాటే శిక్షణ అందిస్తున్న మెదక్ పట్టణానికి చెందిన నగేశ్‌కు కరాటే గిన్నిస్ వరల్డ్ రికార్డు, బోధి వరల్డ్ రికార్డులో చోటు సంపాదించారు. తమిళనాడు ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీ ఫిబ్రవరి 8న చెన్నైలోని ఇండోర్ స్టేడియంలో ప్రపంచ కరాటే మాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కరాటే గిన్నిస్ వరల్డ్ రికార్డు, బోధి వరల్డ్ రికార్డు కార్యక్రమంలో 3వేల మంది కరాటే మాస్టర్లు పాల్గొన్నారు. తెలంగాణ నుంచి నగేశ్ వద్ద శిక్షణ పొందిన 40 మంది కరాటే మాస్టర్లు పాల్గొన్నారు. ఈనెల 2న హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో సినీ నటుడు సుమన్ చేతుల మీదుగా నగేశ్‌కు సన్మానం చేసి, కరాటే గిన్నిస్ వరల్డ్ రికార్డు, బోధి వరల్డ్ రికార్డు సర్టిఫికెట్లు అందజేశారు. నగేశ్‌ను పలువురు అభినందించారు.



నల్లవల్లిలో దీక్ష చేస్తున్న శాలివాహన సంఘం కులస్తులు, రైతు జేఏసీ నాయకులు

## 500 ఫీట్లు బోరు తవ్వించినా నీళ్లు పడలే..

**గుజిరి తండా రైతు రాజు నాయక్ ఆవేదన**



ఎండుతున్న ఉల్లి పంటను చూసి ఆవేదన చెందుతున్న రాజునాయక్

చిలిపిచెడ్, మార్చి 3: మెదక్ జిల్లా చిలిపిచెడ్ మండలంలో భూగర్భ జలాలు అడుగంటాయి. మండలం మీదుగా మంజీరా నది వెళ్తున్నా ఈ ప్రాంత రైతులకు సాగునీటి కష్టాలు తప్పడం లేదు. నీళ్లు లేక పంటలు ఎండిపోతున్నాయని చిలిపిచెడ్ మండలం గుజిరి తండాకు చెందిన రైతు రాజు నాయక్ ఆవేదన వ్యక్తం చేశారు. తనకున్న చెరుకు,ఉల్లి పంటలకు నీరందక ఎండు ముఖం పట్టిందని బోరుమన్నాడు. ఫిబ్రవరిలో 500 ఫీట్లు బోరు వేసినా చుక్కనీరు రాకపోవడంతో సాగుచేస్తున్న చెరుకు,ఉల్లి పూర్తిగా ఎండిపోయిందన్నారు. రూ.5 లక్షల వరకు అప్పులు అయినట్లు తెలిపారు. చండూర్‌లో నిరుపయోగంగా మారిన ఎత్తిపోతల ప్రాజెక్టుకు మరమ్మతులు చేసి నీళ్లందించాలని రైతు కోరారు.

## కేసీఆర్ ఉండంగనే మంచిగా నీళ్లొచ్చినయ్

### ఇప్పుడు రోజంతా నీటి కోసం తండ్లాడుతున్నం



మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డితో గోడు వెళ్లబోసుకుంటున్న గిరిజన మహిళలు

- నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డితో గిరిజన మహిళల ఆవేదన

నారాయణఖేడ్, మార్చి 3: కేసీఆర్ గవర్నమెంట్ ఉన్నప్పుడే నీళ్లు మంచిగ వస్తుండే.. కాంగ్రెస్ గవర్నమెంట్ అచ్చినప్పటి సంది నీళ్లే అస్తలేవు సారు.. అని గిరిజన మహిళలు, సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డితో తమ గోడును వెళ్లబోసుకున్నారు. ఆదివారం భూపాల్‌రెడ్డి కంగ్టి మండలంలో పలు ప్రైవేట్ కార్యక్రమాల్లో పాల్గొని రాత్రి తిరిగి వస్తున్న క్రమంలో గాజులపాడ్ టోపా తండాలో మహిళలు పెద్ద సంఖ్యలో బిందెలతో గుమిగూడి ఓ ప్రైవేట్ బోరు వద్ద నీళ్లు పట్టుకుంటున్నారు. గిరిజన మహిళలను చూసి భూపాల్‌రెడ్డి పలకరించగా, మహిళలు తమ ఆవేదన వ్యక్తం చేశారు. తండాలో ఇంటింటికీ నల్లా ఉంది కదా అని భూపాల్‌రెడ్డి అడగగా, నల్లాలు ఉన్నా ఈ గవర్నమెంట్ నీళ్లు సప్లై చేస్తలేదు సార్ అని అన్నారు. ప్రైవేట్ బోరు ఉన్న వారిని బతిమాలుకుని నీళ్లు నింపుకొంటున్నమని, కేసీఆర్ సీఎం ఉండంగా మాకు ఏ తిప్పలు లేకుండే, ఇప్పుడు రోజంతా నీళ్ల కోసం తండ్లాడుతున్నమని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుబంధు, రుణమాఫీ, మహిళలకు రూ. 2500ల పథకాల గురించి మాజీ ఎమ్మెల్యే ఆరా తీయగా, 'ఏ పథకం లేదు.. అన్ని జూటా మాటలే' అని మహిళలు నిష్టురమాడారు. గిరిజనుల మంచినీటి కష్టాలు చూసి చలించిపోయిన భూపాల్‌రెడ్డి జిల్లా ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడి మిషన్ భగీరథ నీరు అందే విధంగా చూడాలని కోరారు.

## ఎండిన పంటలకు పరిహారం ఇవ్వాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి



లెనిన్‌గనర్‌లో ఎండిపోయిన పంటలను పరిశీలిస్తున్న ఆముదాల మల్లారెడ్డి

కొమురవెల్లి, మార్చి 3 : సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలం లెనిన్‌నగర్‌లో ఎండిన పంటలను సోమవారం సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి పరిశీలించాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొమురవెల్లి మండలం సముద్ర మట్టానికి 550 మీటర్ల ఎత్తులో ఉండడంతో ఎప్పుడూ కరువు కాటకాలు సంభవిస్తున్నట్లు తెలిపారు. అందుకే ఈ ప్రాంతంలో తపాస్‌పల్లి రిజర్వాయర్ నిర్మించారన్నారు. భూగర్భ జలాలు అడుగంటిన నేపథ్యంలో తపాస్‌పల్లి రిజర్వాయర్ నింపి, ఈ ప్రాంతంలోని చెరువులు, కుంటలు నింపి పంటలను కాపాడాలని తహసీల్ కార్యాలయంలో వినతి పత్రం ఇచ్చినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎండిపోయిన పంటలకు ఎకరాకు రూ.50వేలు నష్టపరిహారం అందించాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు శెట్టిపల్లి సత్తిరెడ్డి, మండల కార్యదర్శి తాడూరి రవీందర్, ప్రశాంత్, చక్రపాణి, బాలస్వామి, పరశురాములు, మహేశ్ పాల్గొన్నారు.

## డంపుయార్డు ఏర్పాటును విరమించుకోవాలి



నర్సాపూర్‌లో రిలే నిరాహార దీక్ష చేస్తున్న 3వ వార్డు ప్రజలు



గుమ్మడిదలలో రిలే నిరాహార దీక్ష చేపట్టిన బుడగసంఘాల కులస్తులు, రైతు జేఏసీ నాయకులు

- నర్సాపూర్, గుమ్మడిదలలో కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు

నర్సాపూర్, మార్చి 3: సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం ప్యారానగర్‌లో ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న డంపింగ్‌యార్డుకు వ్యతిరేకంగా మెదక్ జిల్లా నర్సాపూర్‌లో కొనసాగిస్తున్న రిలే నిరాహార దీక్ష సోమవారం నాటికి 14వ రోజుకు చేరుకుంది. నర్సాపూర్ మున్సిపల్ 3వ వార్డు వాసులు పలువురు సోమవారం రిలే నిరాహార దీక్షలో కూర్చున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డంపింగ్‌యార్డు ఏర్పడితే నర్సాపూర్ పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో గాలి, నీరు కలుషితం అవుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆలోచించి డంపింగ్‌యార్డు నిర్మాణాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దీక్షలో దావూద్, రిజ్వాన్, మహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

**కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు**

గుమ్మడిదల, మార్చి 3: సంగారెడ్డి జిల్లా గుమ్మిడిదల మండలం ప్యారానగర్ అటవీ ప్రాంతంలో జీహెచ్ఎంసీ డంపింగ్ యార్డు ఏర్పాటును వ్యతిరేకిస్తూ గుమ్మడిదల, నల్లవల్లి, కొత్తపల్లి గ్రామాల్లో రిలే నిరహార దీక్షలు సోమవారం 27వ రోజు కొనసాగాయి. గుమ్మడిదల మున్సిపల్‌లో చేపట్టిన రిలే నిరాహార దీక్షలో బుడగజంగాల కులస్తులు దీక్ష చేపట్టారు. రైతు జేఏసీ కమిటీ అధ్యక్షుడు చిమ్ముల జైపాల్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ కుమార్‌గౌడ్, జేఏసీ నాయకులు సద్ది విజయ భాస్కర్ రెడ్డి, పుట్ట నర్సింగ్‌రావు, మూడుచింతల నరేందర్ రెడ్డి, ఆలేటి శ్రీనివాస్‌రెడ్డి, తులసీదాసు, ఉదయ్‌కుమార్ తదితరులు సంఘీభావం తెలిపారు. నల్లవల్లిలో శాలివాహన సంఘం కులస్తులు, కొత్తపల్లిలో పలువురు గ్రామస్తులు 27వ రోజు రిలే నిరాహార దీక్షలో పాల్గొన్నారు. దీక్షల్లో రైతు సంఘం అధ్యక్షుడు సదానందరెడ్డి, రైతు జేఏసీ నాయకులు లక్ష్మీనారాయణ, కావలి శంకర్‌యాదవ్, మోహన్‌రెడ్డి, మంద భాస్కర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, కుమ్మరి ఆంజనేయులు, సురేశ్, రామకృష్ణ, కొత్తపల్లి మల్లేశ్‌గౌడ్, చాపల మధు, మహిళా జేఏసీ నాయకులు, యువకులు పాల్గొన్నారు.



గుమ్మడిదల: కొత్తపల్లిలో రిలే నిరాహార దీక్షలో గ్రామస్తులు

## తల్లిని మట్టుపెట్టిన తనయుడు

- మత్తు పదార్థాలకు బానిసై ఘాతుకం
- సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్ డివినోస్ విల్లాస్‌లో ఘటన



రాధికరెడ్డి (ఫైల్)



నిందితుడు కార్తీక్‌రెడ్డి



ఘటనా స్థలిలో రక్తస్రావం

రామచంద్రాపురం, మార్చి 3: ఆస్తి కోసం సొంత కుటుంబాన్నే కడతేర్చాలని కుట్రపన్నాడు ఓ ప్రబుద్ధుడు. తల్లి, తండ్రి, సోదరుడు అనే తేడా లేకుండా అందరినీ హతమార్చితే ఆస్తి తన సొంతం అవుతుందని భావించి నెల రోజులుగా ప్లాన్ చేసుకుంటున్నాడు. ఆన్‌లైన్‌లో 6 కత్తులకు ఆర్డర్ పెట్టాడు. డ్రగ్స్, గంజాయి, మద్యానికి బానిసైన ఆ యువకుడు సొంత కుటుంబంపైనే తన క్రూరత్వాన్ని ప్రదర్శించాడు. కొడుకే తల్లిని విచక్షణరహితంగా కత్తితో దాడి చేసి హత్య చేసిన ఘటన సోమవారం తెల్లావారుజామున సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్‌లో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. తెల్లాపూర్‌కి చెందిన నవారి మల్లారెడ్డికి భార్య రాధికరెడ్డి, ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు సందీప్‌రెడ్డి ప్రైవేట్ ఉద్యోగి, చిన్న కుమారుడు కార్తీక్‌రెడ్డి (26) బీటెక్ చదివి ఖాళీగా ఉంటున్నాడు. తెల్లాపూర్‌లోని డివినోస్ విల్లాస్‌లో నివాసం ఉంటున్నారు. నవంబర్‌లో పెద్ద కుమారుడు సందీప్‌రెడ్డి వివాహం జరిగింది. మత్తు పదార్థాలకు బానిసైన చిన్న కుమారుడు కార్తీక్‌రెడ్డి కారణంగా ఇంట్లో ఆస్తి కోసం తరుచూ గొడవలు జరిగేవి. కార్తీక్‌ని రెండు నెలల క్రితం బెంగళూరులోని రిహాబిటేషన్ సెంటర్‌కు పంపించారు. అక్కడి నుంచి నెల ముందు ఇంటికి వచ్చిన కార్తీక్ ప్రవర్తనలో ఏమాత్రం మార్పు రాలేదు. తనకు రావాల్సిన ఆస్తి తనకు ఇవ్వాలంటూ తల్లి, తండ్రితో గొడవ పడేవాడు. ఆస్తిని ఇవ్వకపోవడంతో కుటుంబ సభ్యులపై పగ పెంచుకొని వారిని హత్య చేయాలని కుట్ర పన్నాడు. తల్లితో పాటు తండ్రి, సోదరుడిని హత్య చేయాలని అనుకున్నాడు. అందులో భాగంగా నెల క్రితం 6 కత్తులను ఆన్‌లైన్‌లో ఆర్డర్ పెట్టాడు. అతని కుట్రలో భాగమే ఆదివారం రాత్రి ఫుల్‌గా మద్యం సేవించి ఇంటికి వచ్చి పడుకున్నాడు. సోమవారం తెల్లావారుజామున ఇంట్లో తన తల్లి రాధికరెడ్డి(51), తండ్రి మల్లారెడ్డి నిద్రిస్తున్న క్రమంలో మొదట తల్లిపై కత్తితో దాడి చేశాడు. వెంటనే తేరుకున్న తండ్రి మల్లారెడ్డి అతని చేతిలో ఉన్న కత్తిని గుంజుకుంటున్న క్రమంలో అతనికి కూడా గాయమైంది. కత్తిని గుంజుకొని అరుస్తూ బయటకు పరుగులు తీశాడు. ఈ చప్పుడు విన్న సోదరుడు సందీప్‌రెడ్డి, అతని భార్య పైన ఉన్న బెడ్‌రూం నుంచి కిందకు వచ్చి చూసేసరికి మరో కత్తితో తల్లిని విచక్షణరహితంగా పొడవగా ఆమె తీవ్ర రక్తస్రావం కావడంతో అపస్మారక స్థితిలో పడి ఉంది. దీనిని గమనించిన సందీప్‌రెడ్డి భార్య శిరీష అడ్డుకోవడంతో, వదిన మీరంటే తనకు గౌరవం అని, పక్కకు జరగండి అని ఆమెతో అంటున్న సమయంలో సందీప్‌రెడ్డి తన బెడ్‌రూంలోకి వెళ్లి లాక్ వేసుకున్నాడు. బయట నుంచి తండ్రి అరుస్తుండడంతో ఇరుగుపొరుగు వారు బయటకు వస్తుండడం గమనించిన అతను అక్కడి నుంచి జారుకున్నాడు. వెంటనే ఆమెను సిటిజన్ దవాఖానకు తీసుకువెళ్లడంతో అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందింది. విషయం తెలుసుకున్న కొల్లూర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. భర్త మల్లారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కార్తీక్‌రెడ్డిని అదుపులోకి తీసుకొని పోలీసులు విచారిస్తున్నారు.